కథా నిలయం
36.22
శ్రీకాకుళం

# 14. మూడు తరాలు

విక్రమార్కుడి గుణగణాలతో సరితూగని రాజు విక్రమార్క సింహాసన మెక్కడానికి అనర్హుడంటూ సాలభంజిక లెన్నిసార్లు అభ్యం తరం చెప్పినా విసుగుచెందని భోజరాజు మళ్ళీ సింహాసనం ఎక్కే ప్రయ త్నం చేసినట్టుగా చెట్టుదగ్గరికెళ్ళాడు రామలింగం ... చెట్టెక్కి శవాన్ని భుజంపై వేసుకొని చెట్టుదిగాడు — శ్మశానం దిక్కు నడుస్తున్న రామ లింగంతో శవంలోని భేతాళుడు

"ఓ మానవా! నీ ముఖం చూస్తుంటే సంసార గొడవల్లో తలమునక లవుతున్నవాడిలా కనబడుతున్నావు —అవునా - ?" అన్నాడు—

"చెప్పుకుంటే సంసారంగుటు బయటపడి మానంపోయేలావుంది— చెప్పుకోకపోతే ప్రాణం పొయ్యేలావుంది - అటు తల్లి ముసల్ది - ఇటు కట్టుకున్న భార్య- వీళ్ళిద్దరిమధ్య గొడవలు భరించడం సాధ్యమవడం లేదు -మరోదిక్కు తన భార్య, కోడలు మధ్య జగడాలు – ఈ ఆడవాళ్ళ కొట్లాటలతో ఇల్లు నరకమవుతుంది - నాకు, నా కొడుక్కు మనశ్శాంతి లేకుండావుంది-తనలో తాననుకుంటూ శ్మశానం దిక్కు నడుస్తున్నాడు రామలింగం—

"నువ్వు చెప్పకున్నా నీ ప్రయత్నం తెలుసుకోలేనంత అమాయ కున్నికాదు—నా బరువు తెలియకుండా ఉండడానికో కథ చెబుతానువిను—' అని కథ మొదలుపెట్టాడు భేతాళుడు—

నర్సమ్మ భర్త బ్రతికున్న కాలంలో ఒంటి నాగలి వ్యవసాయం చేస్తూ బ్రతికాడు —నర్సమ్మ వ్యవసాయపనులన్ని చేసింది— కలుపు

నాటు, కోత, తొడిమ, నీళ్ళు కట్టడంలాంటి అన్ని పనులతో ఒళ్ళుదాచు కోకుండా పనిచేసింది—తాను చెమటోడ్చి పండించిన బియ్యం, మొక్క జొన్నలు, పప్పులు, కూరగాయలు తిన్నది—పచ్చి అనుములు, పచ్చి అటుకులు, పంచి కంకుల్లాంటి ప్రకృతిసిద్ధమైన వాట్ని ఫలహారంగా తింది-భర్త, ఆమె కలిసి కష్టపడి పనిచేసి కొడుక్కు మరికొంత భూమి సంపాదించి పెట్టారు—కొడుకు నప్పట్లో పదవ తరగతి వరకు చదివిం చారు — నర్సమ్మ కొడుకు బడిపంతులు — రిటైర్‌మెంటుకు దగ్గరు న్నాడు—నర్సమ్మ వయసిప్పుడు డెబ్బైఐదేళ్ళు...

నర్సమ్మ కోడలు అన్నపూర్ణ—ఆమెకిప్పుడు యాభై ఏళ్ళు — భర్తకు పల్లెటూళ్ళో ఉద్యోగం — మరో దిక్కు వ్యవసాయముంది— అత్తలా కూళీలతో పనులు చేయకుండా అన్నపూర్ణ కూళీలతో పనులు చేయించింది-తాను పొలం దగ్గరికెళ్ళి కూర్చుని వాళ్ళు చేసేది గమనిస్తూ పనులు చెప్పేది-రకరకాల పిండివంటల్లాంటివి చేస్తూ ఇంటిపనులు తానే చేసుకునేది—ఆమె అత్తకంటే సుఖంగానే బ్రతికిందనవచ్చు — అన్న పూర్ణ కొడుకు పోస్టుగ్రాడ్యుయేషన్ చదివాడు —— పట్నంలో మంచి ఉద్యోగముంది....

అన్నపూర్ణ కోడలు సునీత- ఆమె వయసు పాతిక-భర్తకు మంచి ద్యోగం—పల్లెలో ఉండాల్సిన పనిలేదు—ఎండలో తిరిగే అవసరమూ లేదు—ఇంట్లో కూలర్, ఫ్రిజ్, గ్రైండర్‌లాంటి ఆధునిక పరికరాలు న్నాయి—బట్టలుతుకడానికి, బోళ్ళు కడగడానికి, ఇల్లూడ్వడానికో పని మనిషుంది—సునీత పని కేవలం పిల్లలను చూచుకోవడం— రకరకాల పిండివంటలు రుచికరంగా వండటం—సినిమాలు-షికార్లు- అన్నపూర్ణ జీవితం కంటే సునీత జీవితం మరింత సుఖవంతంగా ఉందనవచ్చు ..

మూడుతరాలకు ప్రతినిధులైన ఆ స్త్రీలు కలిసేది తక్కువే అయినా పొట్లాటలు లేకుండా అన్యోన్యంగానే వుంటున్నారు—సునీత కొడుకు పుట్టు వెంట్రుకలు తీయడాని కోసం అంతా కలిసి వేములవాడ కెళ్ళారు — మొక్కులన్నీ ముట్టజెప్పి సమీపంలోవున్న నాంపెల్లి నర్సింహస్వామిని దర్శించడానికెళ్ళారు—ఆ స్వాముంది గుట్టపైన—అక్కడి కెళ్ళాలంటే నడకేమార్గం— అంతా గుట్టెక్కడం తన నుంచి కాదని తాను కిందనే ఉంటానంది సునీత—అన్నపూర్ణ కూడా గుట్టెక్కడానికి వెనుకముందాడింది—నర్సమ్మ మాత్రం అందరూ గుట్టెక్కి తీరాలని పట్టుబట్టింది— ఇక వాళ్ళకు గుట్టెక్కక తప్పలేదు—

అందరూ గుట్టెక్కుతున్నారు—ఇక్కడో ఆశ్చర్యకరమైన విషయం జరిగింది-నర్సమ్మ-ఎవరి సహాయం లేకుండా గబగబా గుట్టెక్క సాగింది — అన్నపూర్ణ భర్తచేయి పట్టుకొని గొణుగుతూ శాపనార్థాలు పెడుతూ, మధ్యమధ్య కూర్చుంటూ గుట్టెక్కుతుంది — సునిత పరిస్థితి మరీ ఘోరంగావుంది—ఆమెకు భర్తే దాదాపుగా మోసినంతపనైంది— రానన్నా తీసుకొచ్చారని తిడుతూ, ఏడుస్తూ మెల్లమెల్లగా గుట్టెక్కుతుంది — నర్సమ్మ గమ్యస్థానం చేరుకున్న అరగంటకు అన్నపూర్ణ, అటు తర్వాత అరగంటకు సునీత చేరుకున్నారు — దిగేటప్పుడూ అదే తంతు...

కథ చెప్పడం ఆపాడు భేతాళుడు...

"డెబ్బైఐదేళ్ళ వయసులోవున్న నర్సమ్మ అంత ముసలిదైవుండి కూడా అందరికంటే ముందు గట్టునెలా ఎక్కకల్గింది....?

యాభైఏళ్ళ వయసుండి అత్తకంటే సుఖంగా బతుకుతున్న అన్నపూర్ణకు, పాతికేళ్ళ వయసేవుండి అన్నపూర్ణకంటే సుఖంగ బతుతుతున్న

సునీత గుట్టనెక్కడానికి ఒకరికంటే ఒకరెక్కువగా ఎందుకు కష్టపడ్డారు—

ఈ ప్రశ్నలకు జవాబులు తెలిసీ చెప్పకపోయావో నీ ఇల్లు కురుక్షేత్రమయ్యేలా శపిస్తాను—" అని మౌనం వహించాడు భేతాళుడు ....

నర్సమ్మ రెక్కల కష్టంతో బతికింది—ఆమెకు శారీరక శ్రమన్నా ఎంత భారమైనా పనులు చేయడమన్నా భయంలేదు—మానసికంగానూ శారీరకంగానూ కష్టమైన పనులు చేయడానికి సిద్ధంగావున్న నర్సమ్మ ఆ గుట్టనేకాదు అంతకంటే రెట్టింపుగుట్టనైనా ఎక్కగలుగుతుంది...

నర్సమ్మకు అన్నపూర్ణకు పాతికేళ్ళ అంతరముంది — తక్కువ కష్టంతో ఎక్కువ సుఖపడాలన్న మనస్తత్వం, ఆలోచన క్రమక్రమంగా పెరుగొతుంది—అన్నపూర్ణ అత్త చేసిన చాలా పనులను సుఖానికలవాటు పడింది—అందువల్ల అత్తకంటే పాతికేళ్ళు చిన్నదైనా గుట్టనెక్కడానికంత కష్టపడింది....

ఇక సునీత—ఆమె ఈ సమాజానికి ప్రతీకలాంటిది—తన పనులన్నీ మెషీన్లతో చేయిస్తుంది—పని మనుషులతో చేయిస్తుంది—ఆమెకు శారీరకకష్టం పెద్దగా తెలియదు- తిండిసుఖంగానే వున్నా నూనెపదార్థాల నరిగించుకొనే పనికూడా లేదామెకు— అందువల్ల ఆమె శరీరం సోమరిదయి పనిచేయడానికి ఉత్సాహంచూపే స్థితిలో లేదు-అందుకే ఆమెకంత కష్టమైంది—

పోగా ముగ్గురి తిండ్లలోను, నివసించే వాతావరణ పరిస్థితుల్లోనూ తేడాలున్నాయి—నర్సమ్మలా, అన్నపూర్ణకు, అన్నపూర్ణలా సునీతకు ప్రకృతిసిద్ధమైనవి దొరకవు—దొరికే పరిస్థితులూ లేవు...

రామలింగంకు మౌనభంగం కాగానే శవంతోసహా మాయమై మళ్ళీ చెట్టెక్కాడు భేతాళుడు

[జీవగడ్డ జులై 1986]